కరపత్ర అక్షరాలు,చిత్రక చూపులు కలిసి నడిచిన ప్రయాణం..!

# చిత్రక



Chitraka

A PRAVARSH CAPTURE

మార్చి సంచిక,2018

# స్వాగతం

# సుస్వాగతం

Chitraka

A PRAVARSH CAPTURE

# ఈ నెల మిమ్మల్ని పలకరించబోయే చిత్రకవితలు ఇవే


0. పరిచయం 6

1. ఎదురుచూపుకి నిదురేది..? 8

2. మధ్యతరగతి బడి పుస్తకం.. 10

3. ఖరీదు కట్టలేని చెమటచుక్కలు.. 12

4. జ్ఞాపకాల కట్టడం 14

5. అద్దంలో ఆత్మపరిశీలన 16

6. భిన్నత్వంలో ఏకత్వమైన కష్టం 18



సమస్త పాఠక వీక్షక ప్రపంచానికి ఇదే మా పదచిత్ర నమస్కారం..

ఇక్కడ 'మా' అని సంభోదించామని ఆశ్చర్యపోకండి..!
అవును మేము ఇపుడు ఒక్కరం కాదు ఇరువురం..
ఎవరా అనే కదా మీ సందేహం,నాకు తెలుసు..అందుకే కదా ఈ పరిచయ పుట..
నా పేరు మీకేలాగో తెలుసు కదా కరపత్ర..ఇదిగో నా మిత్ర చిత్రక.
మధురమైన భావాలని మనసుని మీటేలా మృదువైన పదాలలో మథించి రచించడం
ఈ కరపత్ర వృత్తి అయితే..
కేవలం కంటికింపుగా మాత్రమే కాకుండా మనసు లోతుల్ని తాకి చూడగల
అందమైన సందర్భాలని అద్భుతమైన చిత్రాలుగా విరచించడం
ఈ చిత్రకకు సంతృప్తి..

అందుకే మా కళలు వేరైనా మా కళాహృదయాలు ఒకటేనని
నిరూపిస్తూ నవ్వినదే మా ఈ సంగమం..
చెరొక కన్నుగా మారి ఒకే చూపుగా పయనించాలనేదే మా మనోభీష్టం..
చిత్రక కన్ను,కరపత్ర పెన్ను కలిసి ఇకపై మీకందించబోతున్నాయి
మరచిపోలేని మధురమైన చిత్ర కవితలెన్నో..

ఆ చిత్ర కవితల గమనానికి నాందిగా..

మా స్నేహ బాంధవ్యానికి ఆదిగా..

చిత్రక ఈ మధ్య తన కెమెరాలో చిత్రించిన కొన్ని సహజమైన చిత్రాలకి,

ఈ కరపత్ర తన మనోరంజకమైన పదభావజాలాన్ని జతచేసి

ఈ మొదటి సంచికని మీకు అందజేయడం జరిగింది..

ఇక ఆలస్యమెందుకు..! పదండి..!

సంభ్రమపూరిత చిత్రాలని వీక్షిస్తూ,

స్వచ్ఛమైన భావాలని పఠిస్తూ..

ఆస్వాదిస్తూ,ఆనందిస్తూ,ఆలోచిస్తూ

మాలో ఒకరిగా

మాతో ఒకరిగా

మన ప్రయాణాన్ని మొదలుపెడదాం

ఇట్లు..

మీ కరపత్ర

తన మిత్ర

చిత్రకతో..

## ఎదురుచూపుకి నిదురేది



రెప్ప వేయడం మరచిపోయిన
ఆ ఇరు కనుపాపల చాటున
సప్త సముద్రాలను మించగలిగే
గాఢ ఆఘాతం దాగుందని
ఆ అమ్మకి మాత్రమే తెలుసు

రేపు అనే ఓ కాలాన్ని చూడగలననే
నమ్మకం లేని ఆ మలి పసిమనసు
మరేదో చూడాలనే తపనతో కాబోలు
అనుక్షణం గుండెని ఆగిపోనివ్వకుండా
అందని ఊపిరినందిస్తూ ఆడిస్తుంది

ఆ చూపు,మామూలు చూపు కాదు
తన ప్రాణాన్ని పంచుకుని పుట్టిన
మనిషిని తన ప్రాణం పోయేలోపుగా
చివరగా ఒక్కసారైనా చూడాలనుకునే
చిరకాలవాంఛ నిండిన నీటి మడుగు

ఇప్పుడే వస్తాను అని తనకి మాట ఇచ్చి
ఇక్కడే ఉండమని చెప్పి ఎటుగా వెళ్ళాడో
తన కొడుకు అని ఆలోచిస్తూ,తన కొడుక్కి
ఏం జరగలేదు కదా అని కంగారుపడుతూ
ఇంకిపోని ప్రేమతో ఇక్కడే ఉండిపోయింది

ఆరునెలలు గడిచాయి ఈ గుడి ఒడిలో
నిజం అవ్వటం లేదని తెలిసినా ఆ తల్లి
రోజూ దేవుడిని అదే కోరిక కోరుకుంటుంది
కడుపులోని ఆకలికి దేవుడి ప్రసాదమే
సమాధానమైతే,మనసు ఆకలి మాటేమిటి

చుట్టూ లెక్కలేనంత జనం ఉన్నారు కానీ
ఎవరి బ్రతుకుతో వాళ్ళు పోరాడుతున్నారు
తనని జాలిగా చూసే చూపుల జాడలేతప్ప
ఈ శరీరం ఒంటరిగా పోరాడలేకపోతుంది
అని తెలుసుకొని తోడుండే మనిషి ఎక్కడ

అల్లారుముద్దుగా పెరిగిన ఒక అందమైన అమ్మాయి తను..
అలుపెరుగక అందరి అవసరాలు తీర్చిన ఇల్లాలు తను..
కొవ్వొత్తిలా తను కరుగుతూ ఆ వెలుగులో ఎందరి జీవితాలనో చక్కదిద్దిన త్యాగశీలి తను..
అలాంటి తనని నేడు కన్నకొడుకే మోసం చేసి వదిలించుకున్నాడని తెలిసినా నమ్మని అమాయకురాలు తను..

ఇన్నాళ్లు అందరికీ అన్నీ తానే అయ్యింది
కానీ నేడు తనే ఒక అనాథగా మిగిలింది
బరువైన శ్వాసలతో,కరిగిపోని ఆశలతో
తడారని కన్నులతో,నిజం కాని కలలతో
నిండిన ఆ ఎదురుచూపుకి నిదురేది ?

# మధ్యతరగతి బడి పుస్తకం




ప్రతీ మధ్య తరగతి మనిషి
ప్రతీ రోజూ చదివే పుస్తకం అది
ప్రతీ మధ్య తరగతి మనిషి
రోజూ కొనగల ఏకైక పుస్తకం అది

తెల్లవారగానే టీ తో కలిసి తోడుగా
నీ చేతుల్లోకి చేరిపోయే నిధి అది
ఉన్నచోటునుంచే ప్రపంచం గురించి
తెలియజేసే సత్యాసత్య సన్నిధి అది

గతంగా మారిన ఆ నిన్నటిని
నీకు గుర్తుచేసే జ్ఞాపకం అది
భవిష్యత్తుగా పలకరించే రేపటిని
నీ కళ్ళముందుంచే దర్శిని అది

అభివృద్ధి,ఆలోచనలు అని మొదలుపెట్టి
ఆటలు,పోటీలు,హత్యలు,ఆత్మహత్యలు
ఎగుమతులు,దిగుమతులు,ఎన్నికలు,
వ్యాపార సంస్థలు,సినిమా సంగతులు అంటూ
వర్ణమాలని అస్తవ్యస్తంగా నేర్పే గురువు అది

మహా అయితే పదిహేను పేజీల వార్తలు
చదువుతూపోతే సుమారు రెండుగంటలు
కానీ పూర్తిగా చదివే ఘనులు,జ్ఞానులు ఎవరు.
నచ్చిన విషయాలకే ప్రాధాన్యమిచ్చే పాఠకులు తప్ప

పచ్చనిచెట్టుని నరికి దేహాన్ని తయారుచేశారు
పచ్చిమెదడుని చిలికి అక్షరాన్ని అలంకరించారు
పచ్చనోటుని తీసుకొని ఆ జ్ఞానాన్ని పంచిపెట్టారు
కానీ దానికి ఉదయం ఉన్న విలువ సాయంత్రానికేది

చదువకముందు అది ఎంతో గొప్పది
అదే చదివేసాక తూకంకి వేసే బరువది
చదివి అమ్మిన మనిషి చేతుల్లోకే మళ్ళీ
ఏ పల్లీల పొట్లంలా ఎన్నిసార్లు చేరిందో

## ఖరీదు కట్టలేని చెమటచుక్కలు




కార్మిక భాషలో చెప్పాలంటే తానొక కష్టజీవి
అదే శ్రీశ్రీ భాషలో చెప్పాలంటే అతనో కవి
అవును! 'క'ష్టజీ'వి' అంటే నిత్య జీవనకవి

మనకళ్ళకి అతనున్న చోటు మురికి ప్రదేశం
కానీ చెమట చిందే చోటే దేవుడుంటాడు
అన్న రవీంద్రుడి కళ్ళకి అదొక దేవాలయం

అతను మనలాంటి ఒక మాములు మనిషే
అతను కూడా కష్టపడే ఒక సగటు మనిషే
కానీ కొందరి కంటికి మాత్రమే తను మనిషి

అతని జేబుకి ఆస్తుల కంటే అప్పులు ఎక్కువ
అతని ఇంటికి ఆదాయం కంటే అవసరాలు ఎక్కువ
అందుకే అతని ఒంటికి విశ్రాంతి కంటే శ్రమే ఎక్కువ

తెల్లవారితే చల్లనినీళ్ళు అతని చర్మాన్ని పలకరిస్తాయి
ఒక చిరిగిన చొక్కా తనని చుట్టూ చేరి హత్తుకుంటుంది
అన్నం పెట్టే సరుకు తలపై పెట్టి బజారులో అడుగెడతాడు

మండుటెండతో అతనికి మంచి స్నేహం
మంచినీళ్లే అతని కడుపుకి పరమాన్నం
చీకటిపడేవరకు చుట్టూ మనుషులే తన కుటుంబం

వచ్చినవాడు కొంటాడో లేదో అని అనుమానం
కొనే వాడు వస్తాడో రాడో అని తెలియని భయం
కానీ సరుకు ఖాళీ కాకపోతే ఆ రోజుకి కడుపు ఖాళీ

అర్థంకాని పరిస్థితులు అతని జీవితంలో ఉన్నా
అర్థంచేసుకోని మనుషులు తన ఇంట్లో ఉన్నా
ఆపడు తన ఒంటరి యుద్ధాన్ని,ఒప్పుకోడు ఓటమిని

రోజులన్నీ ఒకేలా ఉన్నా,రోజుకొక కొత్త పాఠం తనది
ఎన్నాళ్ళు కష్టపడ్డా ఎదగని బ్రతుకు రూపం తనది
పేరుకి పేదవాడైనా,ఖరీదు కట్టలేని చెమటచుక్కలు తనవి

## జ్ఞాపకాల కట్టడం




ఇటుకపై ఇటుకను పేర్చుతూ కట్టిన
కట్టడం మాత్రమే కాదు ఈ చార్మినార్
నాలుగు వందల సంవత్సరాల చరితకు
నిదర్శనంగా నిలిచినదే ఈ చార్మినార్

రాణీ భాగమతిపై ప్రేమతో నిర్మించినట్టి
ఈ భాగ్యనగరపు కిరీటంలో కలికితురాయి
ఆనాటి నిజాముల పరిపాలనలో మెరిసి
హైదరాబాదుగా మారిన రీతికి సాక్షమిదోయి

రాజుల పరిపాలనాదారుఢ్యాన్ని చూసినది
నవాబుల అధికార బలాన్ని చవిచూసింది
అక్రమార్కుల ధనదాహాన్ని రుచిచూసింది
నేటి ప్రజాస్వామ్య అభివృద్ధిని చూస్తుంది

ఒకప్పుడు తనలోంచి ప్రయాణించిన
ఎడ్లబండ్లు,జట్కాలు అన్నీ తనకి స్నేహితులే
ఇప్పుడు తన చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ
పరిగెడుతూ పట్టించుకోని వాహనాలన్నీ చుట్టాలే

వేడి వేడి ఇరానీ ఛాయి సెగతో మేల్కొంటూ
సాటిలేని ధంబిర్యానీ ఘాటుతో నిదరోయే
సామాన్యులు మాన్యులు కలిసి బ్రతికేటి
ఈ తెలుగు రాజధాని జీవనశైలికి శిల్పమిది

వసంతకాలపు పొడి మంచులో తడిసి ముద్దయిపోతుంది
భగభగ సెగల మండుటెండలకి పగుళ్ల పాలైపోతుంది
కురిసే చినుకుల ధాటికి పగుళ్ళచాటు సెలయే రైపోతుంది
అప్పుడప్పుడు మర్మత్తులంటూ రంగులేసి ముస్తాబవుతుంది

బడిపిల్లల పుస్తకాలలో పాఠంగా పలుకుతూ
చరిత్రకారుల కాగితాలలో జ్ఞాపికగా మెదులుతూ
పురాతనశాఖ చేతలలో నలుగుతూ వెలుగుతూ
ఆఖరికి బీడీ కంపెనీకి కూడా తనే బ్రాండ్ అయింది

నలుదిక్కుల నగరపు ప్రగతికి సాక్ష్యము
జంటనగరాల స్నేహాన్ని చేసె దర్శనము
రాష్ట్రమందున్న గొప్ప పర్యాటక ప్రదేశము
ఇప్పటికీ ఎప్పటికీ మాకిష్టమైన చార్మినార్

# అద్దంలో ఆత్మపరిశీలన




కాలచక్రంలో పడి కన్నుమిన్ను కానకుండా
కంటికి గంతలు కట్టుకున్న గుఱ్ఱము వలె
ముందుకు దూసుకుపోతున్న మానవోత్తమా
ఓ క్షణము ఈ మాట ఆలకించి ఆలోచించవా

గడిచిన నిమిషాన్ని కూడా జ్ఞాపకముంచుకొకుండా
ఎదురొచ్చే నిమిషంతో నువ్వు పోరాడే ఈ సమరంలో
ఏం గెలుచుకుంటున్నావు?ఎంత గెలుచుకుంటున్నావు
అనే లెక్కలు పక్కనెట్టి చుట్టుపక్కలను చూడవా ఓ క్షణం

అదిగో ఆ పెద్దాయన ఆలోచన కూడా ఇదే అనుకుంటా
అందరిలో తాను ఒకడిగా బ్రతుకుతున్నాని అనుకుంటూ
తనని తాను మోసం చేసుకుంటున్నానని కనిపెట్టాడేమో
తను కేవలం బ్రతికి ఉన్నాడనే నిజం తెలుసుకున్నాడేమో

అందరితో పాటే తను కూడా తన పని చూసుకోవచ్చు
సమాజంతో నాకు పనేమిటి అనుకోని వెళ్లిపోవచ్చు
కానీ చుట్టూ ఉన్న ప్రపంచంలో ఏదో జరుగుతుందని
గమనించి ఓ క్షణం ఆగిచూసింది అతని మనోనేత్రం

చదువు సంస్కారం మరచిన మనుషులు కొందరు
నియమాలని అతిక్రమిస్తూ దూసుకుపోవాలనే ఆశతో
వరుసక్రమాన్ని వీడి అస్తవ్యస్తంగా హద్దులు దాటగా
నడిరోడ్డుపై నిమిషాల్లో గందరగోళం గానం చేసింది

ముందున్న అంతమంది అవివేకాన్ని చూసి నవ్వుకున్నాడు
అప్పుడప్పుడు అలాంటి వాళ్లలో తానూ ఒకడినని బాధపడ్డాడు
ఎవరికి వారు తామే ముందు వెళ్లాలని,తమ పనికి మాత్రమే
ఆలస్యం కాకూడదనే ఆ స్వార్ధపు మూర్కత్వనికి సిగ్గుపడ్డాడు

కాసేపటికి రద్దీ కరిగిపోయింది,రోడ్డు ఖాళీ అయ్యింది
పెద్దాయన తన పనికై మళ్ళీ ముందుకు కదిలాడు
గడిచిన సంఘటన గొప్పదేమీ కాదు,జ్ఞాపకము కాదు
కానీ ఆ పెద్దాయన తనని తాను చూసుకున్న ఓ అద్దం

మన పనులకు ఆలస్యమవకూడదని
మన ఆశలు నెరవేరాలని ఎన్నోసార్లు
మన తొందరలో మన మూర్ఖత్వంతో
తెలిసీ తెలియక చేస్తున్న తప్పులెన్నో

అలాంటి తప్పే మన ముందు జరుగుతుంటే
ఆ చేస్తున్న మనిషిలో మనం కనిపిస్తుంటే
మనమంటే ఏమిటో మనకి తెలిసొస్తుంది
అసలు మనిషంటే ఏంటో అర్ధమవుతుంది

# భిన్నత్వంలో ఏకత్వం 'కష్టం'




ఒక్కో మనిషికి ఒక్కో రూపం
కానీ అందరి ఆకలి ఒక్కటే
ఒక్కో మనిషిది ఒక్కో కోరిక
కానీ అందరి కష్టం డబ్బుకే

నచ్చి చేస్తున్న పనులు కొన్ని
వచ్చి చేస్తున్న పనులు కొన్ని
సంపాదనలో ప్రతి జేబుకి భేదం
సంతృప్తిలో ప్రతి మనసు ఖేదం

ఒకడి కష్టం ఉదయంతో మొదలై
సాయంత్రానికి సేద తీరుతుంటే
మరొకడి కష్టం వెన్నెలతో మొదలై
వేకువ వెలుతురుకి నిదరోతుంది

బాగా బ్రతకాలనుకునే మనిషి గురి
నెలసరి ఆదాయం వచ్చే ఒకటో తారీఖు అయితే
ఈ దినం బ్రతికితే చాలనుకునే మనిషి గురి
ఆ రోజుకి తన అవసరం,ఆ పూట తన ఆదాయం

పెద్ద పెద్ద సౌకర్యాల కోసం వేటాడుతూ
చిన్న చిన్న సంతోషాలను మరిచే వారు
కొందరు..! చిన్న చిన్న ఆనందాలలోనే
జీవితాన్ని గెలిచామనుకునే వారు కొందరు

పుట్టుకతోనే పోరాడటం నేర్చిన వారు కొందరు
పుట్టెడు కష్టాలున్నా సరే నవ్వేటి వారు మరికొందరు
పక్కవాడితో పోల్చుకోకుండా బ్రతకలేరు కొందరు
సాటివాడితో పోలిస్తే సహించలేని వారు మరికొందరు

ఎంత కష్టపడ్డా ఎదగని ఈ మధ్యతరగతి హద్దు
ఎలాగైనా సరే పై తరగతికి వెళ్లాలనే ఆశ తీరదు
ఎక్కడ క్రింది తరగతికి జారిపోతామో అనే భయం వీడదు
ఇలా ఊపిరి ఉన్నంత కాలం నడుమ ఈ ఊయల ఆగదు

~ శుభం ~

ముందుగా మా ఈ చిన్ని ప్రయత్నాన్ని
ప్రోత్సహిస్తున్న ప్రతి మనసుకు
కృతజ్ఞతలు తెలుపుతూ

మీ
మంచి ఆరోగ్యాన్ని
మరిచిపోలేని ఆనందాన్ని
సదా కోరుకుంటూ

మార్చి మాసపు సంచికలో
మరిన్ని చిత్ర కవితలతో
మళ్ళీ మిమ్మల్ని కలుసుకుంటామని
మాట ఇస్తూ ఇక సెలవు



మీ విలువైన అభిప్రాయాలని మాతో పంచుకోవాలనుకుంటే

ఈ క్రింది మెయిల్ రూపంలో మేము సదా మీకు సన్నిహితమే

~ Karapatra4u@gmail.com ~

Chitraka

A PRAVARSH CAPTURE

కలల నిలయం

కళల ఆలయం

మా

చిత్రక & కరపత్రల

చిరు సంగమం

ఉత్తరం

కరపత్ర

కాలపు జ్ఞాపకం

*Chitraka*

A PRAVARSH CAPTURE